# ముగుస్తున్న టైపుమిషన్ల శకం

- విరివిగా కంప్యూటర్ల ప్రవేశం
- టైప్ మిషనుకు తగ్గిన ప్రాధాన్యత
- తయారీని మానేసిన కంపెనీలు
- అక్కడక్కడా కొనఊపిరితో కొనసాగుతున్న టైప్ శిక్షణ కేంద్రాలు


టైప్‌రైటింగ్ ఇనిస్టిట్యూట్‌లో విద్యార్థినులు

**తెనాలి:** టైప్ రైటింగ్ మిషన్లకు చావుకళ వచ్చేసింది. నిత్యం బ్యాచ్‌లవారీగా కీబోర్డు మీటలు నొక్కే చేతులు ఇప్పుడు కరువయ్యాయి. ఒకప్పుడు పది మిషన్లు వందకుపైగా విద్యార్థులతో కళకళలాడిన టైప్ ఇనిస్టిట్యూట్‌లు ఇప్పుడు కనిపించటం లేదు. టైప్ రైటింగ్ పరీక్షలకు గతంలో వేలాదిమంది అభ్యర్థులతో కనిపించే హడావుడి ఇప్పుడులేదు. వెరసి టైప్ మిషను నిస్తేజమైంది. కంపెనీలు సైతం ఉత్పత్తిని నిలిపివేశాయి. పాత మిషన్లతోనే అక్కడక్కడా కొన్ని సంస్థలు కొన ఊపిరితో నడుస్తున్నాయి. సాధకులు లేక జీరాక్స్ మిషను, జాబ్ వర్క్‌తో నిర్వాహకులు ఉపాధిని పొందుతున్నారు. ఒకప్పుడు టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థినీ విద్యార్థులు మరుసటిరోజు నుంచీ, వీధి చివర లేదా పక్క రోడ్డులోనే ఉండే టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్‌కు వెళ్లేవారు. టైప్ నేర్చుకుంటున్నానంటూ గర్వంగా చెప్పేవారు.

'మా అబ్బాయి టైపుకు వెళుతున్నాడు' అని పెద్దలూ చెప్పుకునే వారు. వేసవి రోజుల్లో టైపు ఇనిస్టిట్యూట్లు కిటకిటలాడేవి. ఎ..ఎస్..డీ..ఎఫ్...అనుకుంటూ కీబోర్డు నొక్కుతుంటే టకటకలతో అక్కడంతా లయబద్ధమైన శబ్దం వినిపించేది. ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌వారు ఏడాదికి రెండుసార్లు జరిపే టైప్‌రైటింగ్ పరీక్షలకు వేలాది విద్యార్థులు హాజరయ్యేవారు. ఇంటర్ పూర్తయ్యేనాటికి ఎందరో విద్యార్థులు టైపులోనూ లోయర్, హయ్యర్ పూర్తిచేసేవారు. వీటి తోపాటు షార్ట్‌హ్యాండ్ నేర్చుకుని ఆ పరీక్షలకూ వెళుతుండేవారు. టైప్ మిషనకు ఆ కాలమంతా ఒక స్వర్ణయుగం.

కాలం మారిపోయింది. యంత్రమొచ్చి కూలీలకు కష్టం తెచ్చినట్టే, కంప్యూటర్ రాకతో టైప్‌మిషనుకు ప్రాధాన్యత తగ్గిపోయింది. కార్పొరేట్ చదువులు, అక్కడిచ్చే రకరకాల కోచింగ్‌లతో టైపుకు వెళ్లేంత సమయం విద్యార్థులకు లేకుండాపోయింది. వెరసి టైప్ ఇనిస్టిట్యూట్లకు గడ్డుకాలం దాపురించింది. టైపు నేర్చుకునేవారి సంఖ్య క్రమంగా తగ్గిపోవటంతో ఇనిస్టిట్యూట్లు మూతపడసాగాయి. తెనాలి, పరిసరాల్లో 40–50 ఏళ్ల క్రితం నుంచి నడిచిన 50 టైప్ ఇనిస్టిట్యూట్లలో అత్యధికం కనుమరుగయ్యాయి. ప్రస్తుతం ఆరు సంస్థలు నడుస్తుండగా, కొద్దిరోజుల క్రితం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల శ్రీసాయి శ్రీనివాస టైప్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు కాకుమాను సత్యనారాయణ మరణించటంతో ఇప్పుడు కేవలం అయిదు ఇనిస్టిట్యూట్లు మాత్రమే నడుస్తున్నాయి. అవి కూడా తమ దగ్గరున్న పాత మిషన్లతోనే కొనసాగిస్తున్నాయి. తెనాలి నుంచి ఒకప్పుడు ఆర్నెల్లకోసారి వెయ్యిమంది చొప్పున ఏటా రెండు వేలమంది రాష్ట్ర ప్రభుత్వ టెక్నికల్ పరీక్షలకు హాజరయ్యేవారు. ప్రస్తుతం వీరి సంఖ్య మూడంకెలకు చేరుకోవటం లేదంటున్నారు.

గతంలో ఇంగ్లిష్‌తోపాటు తెలుగు, హిందీ టైప్‌రైటింగ్ కూడా నేర్చుకునేవారు. కంప్యూటర్లో ఇంగ్లిష్ కీ బోర్డు దాదాపు ఒకేలా ఉండగా, తెలుగు, హిందీ భాషలకు కీ బోర్డులో మార్పులు వచ్చేశాయి. దీంతో అక్కడక్కడా ఇంగ్లిష్ టైపుకు మాత్రమే వెళుతున్నవారు కనిపిస్తున్నారు మినహా తెలుగు, హిందీ టైపు శిక్షణ తీసుకునేవారు. ఆ పరీక్షలకు హాజరయేవారు లేకుండాపోయారు. టైప్‌మిషన్ల వినియోగం అధికంగా ఉండటంతో రిపేర్లకోసం ముగ్గురు మెకానిక్‌లు ఉండేవారు. నిత్యం బిజీగా ఉండే వీరు, టైప్ పరీక్షలప్పుడు కూడా పరీక్ష కేంద్రంలో అందుబాటులో ఉంటూ ఏవైనా మిషన్లు మెరాయిస్తే సరిచేస్తుండేవారు. అప్పట్లో రెమింగ్‌టన్, గోద్రెజ్, హాల్డా, ఫాసిట్ కంపెనీల టైప్‌మిషన్లు బాగా పాపులర్. ప్రస్తుతకాలంలో ఆయా కంపెనీలు తమ ఉత్పత్తులను నిలిపివేశాయి.


గోద్రెజ్ కంపెనీ టైప్‌రైటర్

### టైపు శిక్షణలో అరవై నాలుగేళ్లుగా...



టౌన్ చర్చి ఎదురు వీధిలోని శ్రీబాలాజీ టైప్ ఇనిస్టిట్యూట్‌ను 1960లో మా తండ్రి టి.కోటి సూర్యం స్థాపించారు. కొన్నేళ్లుగా నా అధీనంలో నడుస్తోంది. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిది వరకు బ్యాచ్‌లవారీగా శిక్షణని చ్చేవాళ్లం. ఇప్పుడా వైభవం లేదు. ఉన్న మిషన్లతోనే ఎవరైనా వస్తే నేర్పుతున్నాం.

– టి.రామకృష్ణారావు, తెనాలి

### పరీక్షలకు 14 బ్యాచ్‌లను పంపేవాళ్లం...



మారీసుపేట ఎరువుల కొట్ల బజారులో సంజయ్ టెక్నికల్స్‌ను 1977లో ఆరంభించాను. ఏటా లోయర్ పరీక్షకు 9 బ్యాచ్‌లు, హయ్యర్ పరీక్షకు ఆరు బ్యాచ్‌లను పంపేవాళ్లం. నాలుగు రోజులు జరిగేవి పరీక్షలు. ఇప్పుడు తగ్గిపోయారు. వ్యాపారం సాగక ఫొటోస్టాట్ మిషను, కంప్యూటర్ పెట్టుకుని జాబ్ వర్క్ చేస్తున్నాం. డిగ్రీ అయిన కొడుకు కిరణ్‌కుమార్ సహకరిస్తున్నాడు.

– బొలిశెట్టి రామకోటేశ్వరరావు, మారీసుపేట

### టైప్ పరీక్షలకు వెళ్లేవారు లేరు



కొత్తపేటలో పద్మజ టెక్నికల్స్‌ను 1972 నుంచి నిర్వహిస్తున్నాను. ఏటా 150 మందిని టైప్ పరీక్షలకు పంపేవాళ్లం. ఇప్పుడు పరీక్షకు వెళ్లేవారు ఎవరూ లేరు. ఎవరైనా వస్తే టైపు నేర్పుతున్నాం. ఆదాయం చాలక టైప్‌మిషనుపై జాబ్‌వర్క్, జీరాక్స్ మిషను పెట్టుకుని బండి నడుపుతున్నాను.

– ఆర్.సుబ్బారావు, కొత్తపేట

### ఏకైక మెకానిక్‌ను నేను..



1978లో టైప్‌రైటింగ్ ఇనిస్టిట్యూట్ ప్రారంభించి రెండేళ్ల తర్వాతనుంచీ మెకానిక్ వర్క్ మొదలుపెట్టాను. నాతో సహా ముగ్గురు మెకానిక్‌లు ఉండేవాళ్లం. ఎంతో బిజీగా ఉండేది. ఇప్పుడాంతా మారిపోయింది. మిగిలిన ఇద్దరు చనిపోయారు. నేనొక్కడినే ఉన్నా. టైపు ఇనిస్టిట్యూట్లు తగ్గిపోయాయి. పాత మిషన్లనే వాడుతున్నారు. కొత్త మిషన్లు రాకున్నా, ఢిల్లీలో స్పేర్‌పార్టులు మాత్రం దొరుకుతున్నాయి.

–సీహెచ్ లక్ష్మీనిరంజన్, టైప్‌రైటర్ మెకానిక్

# భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

- కార్తికమాసం తొలి సోమవారం
- తెనాలిలో భక్తులతో కిక్కిరిసిన శైవాలయాలు


పాత శివాలయంలో కిక్కిరిసిన భక్తులు


దీపారాధనలు చేస్తున్న మహిళలు


రామలింగేశ్వరపేట శివాలయంలో విశేష దీపాలంకరణ

**తెనాలి:** పవిత్ర కార్తికమాసంలో విశేషమైన తొలి సోమవారం పట్టణంలోని వివిధ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునుండే ఆలయాల్లో భక్తుల సందడి మొదలైంది. చారిత్రక ప్రసిద్ధి చెందిన గంగానమ్మపేటలోని శ్రీ పర్వతవర్ధినీసమేత శ్రీరామేశ్వరస్వామి (పాత శివాలయం) ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున మూడుగంటల నుంచీ ఆలయానికి భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లతో పాటు ఇటు ఆలయ ప్రాంగణం మొత్తం కిక్కిరిసింది. మహిళలు అక్కడి తోట ప్రాంగణంలో కార్తీక దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీరామేశ్వర స్వామికి ఉదయం నుండే విశేష అభిషేకాలు చేశారు. స్వామి దర్శనానికి అత్యధిక సమయం పట్టినప్పటికీ క్యూలైన్లలో వేచి ఉండి మరీ దర్శించుకున్నారు. ఆలయ ఈవో వీవీ రాజకుమారి పర్యవేక్షించారు. మారీసుపేటలోని శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలోనూ భక్తుల రద్దీ నెలకొంది. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్తీక దీపారాధనలు చేశారు. రామలింగేశ్వరపేటలోని శ్రీ దుర్గాపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో తొలి కార్తిక సోమవార పూజలు విశేషంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తిక దీపారాధనలు చేశారు. శ్రీశైల భక్త సేవాసమితి ఆధ్వర్యంలో గత 16 ఏళ్లుగా చేస్తున్నట్టే ఇక్కడి రామలింగేశ్వరపేట శివాలయంలో విశేష దీపాలంకరణ చేశారు. సమితి అధ్యక్షుడు ఆళ్ల వెంకటసుబ్బయ్య, కార్యదర్శి పరిమి గోవర్ధన్, కోశాధికారి కోన బ్రహ్మానందగుప్త తదితరులు పాల్గొన్నారు. అట్లాగే సుల్తానాబాద్ లోని శివాలయంలో కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. నెల రోజుల పాటు కార్తిక మాస పూజలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. పినపాడులో ఎంతో ప్రసిద్ధి చెంది 400 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతనమైన శ్రీ గంగా భ్రమరాంబా సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కూడా తొలి కార్తిక సోమవారం పూజలు వైభవంగా జరిగాయి. బ్రహ్మసూత్రం కలిగి ఉన్న శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు ఉదయాన్నే ఆలయానికి వచ్చి దీపారాధనలు చేశారు. శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామంలోని శ్రీబాల త్రిపుర సుందరీ సమేత శ్రీసంగమేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాస విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. కార్తిక సోమవారం పురస్కరించుకుని పరిసర ప్రాంతాల ప్రజలు ఆలయానికి తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుండి స్వామి వారికి విశేష రుద్రాభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుండి భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మాణిక్యారావు సిద్దార్థ వెంకట మార్కండేయరావు, కార్యనిర్వాహణాధికారి వి.పద్మ, ఆలయ అర్చకులు పర్యవేక్షించారు.

## రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక


పెనుమూడి బ్యూల


హాకీ పోటీలకు ఎంపికైన షేక్ హనీఫ్, షేక్ రియాజ్

**తెనాలి:** రాష్ట్ర స్థాయి అండర్–19 ఫెన్సింగ్ పోటీలకు 9వ తరగతి చదువుతున్న పెనుమూల బ్యూల, హాకీ పోటీలకు షేక్ హనీఫ్ (9వ తరగతి), షేక్ రియాజ్(8 వ తరగతి) ఎంపికైనట్లు స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చిలకా సుందరరావు తెలిపారు. జిల్లాపరిషత్ హైస్కూలు, నందిగం, సత్తెనపల్లిలో సోమవారం జరిగిన స్కూల్‌గేమ్స్‌లో పాల్గొన్న తమ విద్యార్థులు సత్తా చాటినట్లు చెప్పారు. ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు కర్నూలులోనూ, హాకీ రాష్ట్రస్థాయి పోటీలు కాకినాడలో జరుగుతాయని వివరించారు. విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన అభినందించారు.

## పాఠశాల విద్యార్థులకు వనరుల పంపిణీ


విద్యార్థుల సమక్షంలో హకీంజానికి సత్కారం

**తెనాలి:** పట్టణానికి చెందిన వేజళ్ల వెంకట సుబ్బారావు 90వ జయంతిని సోమవారం స్థానిక మారీసుపేట మఠంబజారులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. వేజళ్ల వెంకట సుబ్బారావు స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్, పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు బాలసాహిత్యం, నీతికథల పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, మొక్కలు, గుడ్డ సంచులు, పెన్నులు, రంగు పెన్సిళ్లు, బిస్కట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. బాలసాహిత్యం చదవాల్సిన ఆవశ్యకతపై ప్రముఖ బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇదే వేదికపై అబ్దుల్ హకీంజానిని 'బాలసాహిత్యరత్న' పురస్కారంతో ఉమామహేశ్వర్ సత్కరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గణేష్, పుల్లారావు, సీఆర్‌పీ శ్రీదేవిని కూడా సన్మానించారు. ట్రస్ట్ సభ్యులు టీఎస్‌వీ ప్రసాద్, బి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

## నేడు పెదరావూరులో తులశమ్మ కాంస్య విగ్రహావిష్కరణ



**తెనాలి:** స్వరాజ్య ఉద్యమ కాలంలో మహాత్మాగాంధీ పర్యటనల్లో ప్రజలు స్వచ్ఛందంగా నగదు, బంగారు ఆభరణాలనూ ఆయనకు విరాళాలిచ్చారు. తెనాలికి చెందిన కల్లూరి తులశమ్మ తన బంగారు నగలను. ఇవ్వటమే కాదు...తాళి కట్టిన భర్తనూ త్యాగం చేశారు. భర్తను ఒప్పించి, తానే స్వయంగా ఆయనకు మారుమనువు చేసి మరీ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. జైలుకెళ్లారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత కూడా గాంధీ సిద్ధాంతాలతోనే జీవితాన్ని గడిపిన ఆదర్శ స్త్రీమూర్తి తులశమ్మ. స్వస్థలమైన తెనాలి రూరల్ మండల గ్రామం పెదరావూరులో మంగళవారం ఆమె కాంస్య విగ్రహఆవిష్కరణ జరగనుంది. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి పాల్గొంటారు.

## సుందర తెనాలి కలను సాకారం చేసుకుందాం



**తెనాలిఅర్బన్:** సుందర తెనాలి కలను సాకారం చేసుకునేందుకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. ఐతానగర్‌లో సోమవారం ఆమె పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**రేపల్లె రూరల్:** అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

స్థానికుల సమాచారం మేరకు మండలంలోని మైనేనివారిపాలెం గ్రామానికి చెందిన బొలిశెట్టి తరుమలరావు కిరాణా దుకాణంలో ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించగా 12.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిపై సివిల్ సప్లయీస్ అధికారులకు సమాచారం అందించగా.. వారు పరిశీలించి రేషన్ బియ్యంగా నిర్ధారించారన్నారు. తిరుమలరావు గ్రామంలో ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యంను సేకరించి అక్రమంగా విక్రయాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం

**పిట్టలవానిపాలెం(కర్లపాలెం):** సేంద్రియ ఆహార ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం పిట్టలవానిపాలెం మండల కో–ఆర్డినేటర్లు సుధాదేవి, ప్రవల్లిక, సౌజన్య తెలిపారు.

మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలను సోమవారం మండల పరిషత్ కారాలయం వద్ద విక్రయానికి ఉంచారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం కో–ఆర్డినేటర్లు మాట్లాడుతూ రైతులు సాగుచేసే వరి, వేరుశనగ, మినుముతో పాటు కూరగాయల పంటలు కూడా ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులను వినియోగించి పండించాలని చెప్పారు.

## బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు నిషేధం

ఏసీపీ శివన్నారాయణ


చెంచుపేటలో అక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

**తెనాలిఅర్బన్:** పట్టణంలో అనధికారిక ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధించామని మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ టి.శివన్నారాయణ పేర్కొన్నారు. మున్సిపల్ మార్కెట్‌పై ఉన్న ఫ్లెక్సీలతో పాటు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న అనధికార ఫ్లెక్సీలను సోమవారం తొలగించారు. అలాగే చెంచుపేటలోని కె.ఎస్.ఎం. స్కూల్ రోడ్డులోని అక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమణలు తొలగించడం జరిగిందన్నారు. మున్సిపల్ అనుమతి లేకుండా ఎవరు అనాధికార ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. అలాగే ప్రధాన రోడ్డు, మురుగు కాల్వలపై అక్రమణలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీవో సాంబశివరావు పాల్గొన్నారు.

## దేవాలయం నిర్మించాలి

**బాపట్ల:** బాపట్ల పట్టణం గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మాణం చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు నిరసన తెలిపారు. గత ప్రభుత్వం దేవాలయం నిర్మాణానికి పూనుకోగా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవటం బాధకరమన్నారు. దేవాలయం నిర్మాణం చేపట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, అర్చకులు బాబీస్వామి, విశ్వహిందూపరిషత్ నుంచి చీమలదిన్నె శివయ్య, ధూళిపాళ్ల శీను, బండ్రెడ్డి రజిని తదితరులున్నారు.

## తెనాలి రౌడీషీటర్ అరెస్ట్

**నగరంపాలెం:** ఒకరిపై హత్యాయత్నం చేసి, స్కూటీని దహనం చేసిన రౌడీషీటర్‌ను, అతడికి సహకరించిన మరోకరిని తెనాలి టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని హాల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వివరాలు వెల్లడించారు. గత నెల 28న కాకుమాను ఇంద్రజిత్ తన వద్ద పని చేసే వ్యక్తిని తెనాలి ఐతానగర్‌లో వదిలి వస్తున్నాడు. అదే ప్రాంతంలో తిరిగి వస్తున్న ఇంద్రజిత్‌ను తెనాలి ఐతానగర్ పల్లెకొండవారివీధికి చెందిన రౌడీషీటర్ సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డు, చొక్కా సురేష్ అలియాస్ సుబ్బారెడ్డి పిలిచారు. దీంతో అతను ఆగకపోవడంతో అతనిపై రౌడీషీటర్ దాడికి పాల్పడ్డాడు. కత్తితో పొడిచేందుకు ప్రయత్నించగా, అతను తప్పించుకుని వెళ్లాడు. స్నేహితుని సహాయంతో తెనాలి ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. బాధితుడి స్కూటీని పెట్రోలు పోసి దహనం చేశారు. ఈ కేసులో ఇద్దర్ని అరెస్ట్ చేశారని వివరించారు. సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డుపై 2013 నుంచి రౌడీషీట్ ఉందని చెప్పారు. ఐదు హత్య కేసులు, రెండు హత్యాయత్నం కేసులు, పలు కొట్లాట కేసుల్లో నిందితుడని పేర్కొన్నారు. సమావేశంలో తెనాలి డీఎస్పీ జనార్దనరావు, సీఐ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు



**తెనాలిఅర్బన్:** తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో మూడు అర్జీలు వచ్చాయని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. వాటిలో వికలాంగ పెన్షన్ గురించి ఒకటి, టిడ్కో నివాసాల వద్ద కరెంటు స్తంభాలు ఏర్పాటు చేయాలని మరొకటి, మంచినీటి పంపు ఏర్పాటు చేయాలనే అర్జీలు ఉన్నాయన్నారు.

### మురుగు ప్రతి రోజు తొలగించండి



**తెనాలిఅర్బన్:** పట్టణంలోని మురుగు కాల్వలలోని మురుగును ప్రతి రోజు తొలగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి ఆదేశించారు. పట్టణంలోని 2,16,17 వార్డుల్లో సోమవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వల్లో ప్రణాళికాబద్ధంగా పూడికతీత పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మురుగు కాల్వలపై ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు.

### కళాదర్శకుడు రత్నాకర్‌కు సత్కారం



**తెనాలి:** 'ప్రాచీనభారత్' పేరుతో జాతీయ చిత్రకళా ఉత్సవం–2024 ఒంగోలు అంబేడ్కర్ భవనంలో ఆదివారం నిర్వహించారు. కళాయజ్ఞ, నెస్ట్ మేకర్స్, సృష్టి ఆర్ట్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో చిత్రకళా రంగంలో సేవలందిస్తున్న ప్రముఖులను ఆహ్వానించి సత్కరించారు. తెనాలి పట్టణానికి చెందిన వరల్డ్ రికార్డు హోల్డర్, సినీ ఆర్ట్ డైరెక్టర్ కనపర్తి రత్నాకర్ కూడా ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఆయా సంస్థల నిర్వాహకులు వై.శేషబ్రహ్మం, కె.భూపాల్ రెడ్డి, తిమ్మిరి రవీంద్ర సత్కరించారు.

### క్షయవ్యాధి నివారణకు పౌష్టికాహారం దోహదం



**తెనాలిఅర్బన్:** క్షయ వ్యాధి నివారణకు పౌష్టికాహారం దోహదపడుతుందని తెనాలి టీబీ యూనిట్ అధికారి డాక్టర్ రాధిక పేర్కొన్నారు. నందులపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సోమవారం క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వెంటనే మందులు వాడటం ద్వారా దానిని అరికట్టవచ్చు అన్నారు. క్షయ వ్యాధి ఇతరులకు సోకే ప్రమాదం ఉందన్నారు. రోగులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి, సోషల్ వర్కర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్, సిబ్బంది లక్ష్మి, భార్గవి, దిలీప్, పుష్పలత పాల్గొన్నారు.

### ఇంటింటా నైపుణ్యగణనపై అవగాహన

**కొల్లిపర:** జనాభా లెక్కింపు మాదిరిగా త్వరలో సచివాలయం సిబ్బంది మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చదువుకొని నైపుణ్యం ఉంది ఎటువంటి ఉద్యోగాలు చేయకుండా ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ సెన్సస్ (నైపుణ్య గణన) ఆన్‌లైన్ యాప్‌లో వారి డేటాను నమోదు చేయాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాయం ఉద్యోగులకు నైపుణ్య గణన సర్వే పై వారికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో ప్రతి నిరుద్యోగి విద్యార్హతలు, ఏ పని చేస్తున్నారు. వారి నైపుణ్య వివరాలు నమోదు చేయాలన్నారు. ఇలా నమోదైన వారికి ప్రభుత్వం ఆన్‌లైన్‌లోనే పరీక్ష నిర్వహించి వారి నైపుణ్యాలు గుర్తించి వారికి శిక్షణ అందించటం జరుగుతుందన్నారు. అనంతరం శిక్షణలో యాప్ ఏవిధంగా ఉపయోగించాలి అన్న అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భార్గవ్, జెవి.సాయిప్రత్యూష, మండల కోఆర్డినేటర్ పి.శ్రావణి, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**తెనాలిరూరల్:** విద్యుత్ టవర్ లైన్ల మరమ్మతులు కారణంగా తెనాలి పట్టణంలోని సుల్తానాబాద్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం తొమ్మిది నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏడీఈ బోరుగడ్డ అశోక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

### బిచ్చగాడికి అంత్యక్రియలు



**తెనాలిఅర్బన్:** రైల్వేస్టేషన్‌లో భిక్షాటన చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన 70 సంవత్సరాల వృద్ధునికి శ్రీ శివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి ప్రతినిధులు అంత్యక్రియలు నిర్వహించారు. వారి కథనం ప్రకారం 70 సంవత్సరాల వృద్ధుడు రైల్వేస్టేషన్ లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. అతడు అనారోగ్యంతో ప్లాట్ ఫాంపై మృతి చెందాడు. దీన్ని గమనించిన ప్రయాణీకులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. త్రీటౌన్ పోలీసులు సూచన మేరకు శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని మహా ప్రస్థానంలో సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో మల్లెల వాసు, బి.పోతురాజు పాల్గొన్నారు.

### సీఎంపై పోస్ట్ చేసిన యువకుడిపై కేసు

**తెనాలిరూరల్:** సీఎం చంద్రబాబుపై సోషల్ మీడియాలో కించ పరుస్తూ పోస్ట్ పెట్టాడంటూ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన ఆళ్ల జగదీష్‌రెడ్డి చంద్రబాబుపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. దీనిపై టీడీపీ పట్టణ బీసీ విభాగం అధ్యక్షుడు ఫణిదపు దుర్గ త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.